కథ



దిష్టి తీయడం పూర్తయి, కుడికాలు ముందు పెట్టి ఇంట్లోకి అడుగు పెట్టగానే నా కొత్త పెళ్ళాం రాగిణి అడిగిన మొట్టమొదటి ప్రశ్న 'ఏవండీ... మనింట్లో టీవీ ఉందా? ఛానెల్ కనెక్షన్ ఉందా?' అని.

'వైడ్ స్క్రీన్తో సోనీ బ్రవియా టీ.వీ. ఛానల్ కనెక్షన్ అన్నీ ఉన్నాయి..' అన్నాను అప్పుడప్పుడూ తన శరీరం, కాళ్లూ, చేతులూ తగులుతున్నప్పుడు కలిగే స్పర్శా సుఖం అనుభవిస్తూ తన్మయత్వంతో.

"భలే.." అని లోపలికెళ్లగానే గోడకున్న టీ.వీ. ముందున్న సోఫాలో కూలబడిపోతూ టీ.వీ. రిమోట్ ను చేతిలోకి తీసుకుని అరమోడ్పు కళ్లతో చూడసాగింది.

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

# అడ్వర్టయిజ్‌మెంట్ ఒక బలహీనత

అమ్మా నాన్నలకు, చుట్టూ ఉన్న వాళ్లకు కొత్త కోడలి ప్రవర్తన వింతగా తోచి బుగ్గలు నొక్కుకోసాగారు. నాకూ విచిత్రంగా అనిపించినా 'కొత్త మోజులో' ఏమన లేక ఆమె పక్కన కూలబడిపోయాను.

"బాబూ.. అమ్మాయి చదువులో సరస్వతి, కలిసి రావడంలో లక్ష్మీదేవి, ఓర్పులో భూదేవి. ఎప్పుడు ఎలా పట్టిందో ఈ అడ్వర్టయిజ్‌మెంట్ల పిచ్చి. పగలూ రాత్రీ టీ.వీ.లో వాటినే చూస్తుంటుంది. మొదట్లో మేము అంత పట్టించుకో లేదు. కానీ అదే లోకమయేసరికి, పెళ్లి కావాల్సిన పిల్ల అలా టీ.వీ.కి అతుక్కుపోవడం సరి కాదని టీ.వీ.ని అమ్మేశాం. మాట పలుకూ లేకుండా దెయ్యం పట్టి నట్టయిపోయింది. సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసి కెళ్లి చూపించాం. ఆయన

"దీన్ని పిచ్చనడానికి వీల్లే దండీ. అలా అయితే ఇప్పటి వాళ్లంతా సెల్‌కి సర్వకాల సర్వావస్థల్లోనూ అతుక్కుపోయి, హెడ్ ఫోన్స్ పెట్టుకుని మ్యూజిక్ వింటూ, వాట్సప్ మెసేజ్‌లు రిసీవ్ చేసుకుంటూ, రిప్లైలు ఇస్తూ, అనేకానేక యాప్‌లు, మెయిల్స్, ఫేస్‌బుక్‌లు చూస్తూ ట్రాఫిక్‌లోనూ వాటి బారి నుంచి బయటపడలేక ప్రాణాలు సైతం వదులుతున్నారు. ఆ విషయానికి వస్తే మీ అమ్మాయే నయం. ఇంట్లోని టీ.వీ.కి అడిక్ట్ అయింది. ఇంటి పట్టునే ఉంటోంది. నెమ్మది నెమ్మదిగా ఆమెకి నచ్చజెప్పి మాన్పించండి. ముందు ఇంట్లో టీ.వీ. పెట్టించండి. లేకపోతే మీ అమ్మాయి దక్కదు. నేను మంచివాణ్ని. మీరు నా దగ్గరకు వచ్చారు కాబట్టి చెప్పాను. అదే మీరు మరొక డాక్టర్ దగ్గరకి వెళ్లుంటే మీ అమ్మాయి బలహీనత పోవడం మాట అటుంచి మీరు ఆర్థికంగా కుంగిపోయేవారు. ఆ..'' అన్నాడు. అప్పటి నుంచి మా అమ్మాయికి ఎన్నో చెప్పాం, ఎంతో ప్రయత్నించాం, కుదరలేదు. ఒకసారి ఢిల్లీ ఎళ్లుండే మా దూరపు బంధువొకాయన మా ఇంటికొచ్చాడు. మా అమ్మాయిని గమనించి, మా మానసిక మథనాన్ని కొంత తనంతట తాను, మరికొంత మమ్మల్ని అడిగి తెలుసుకుని ఒక సలహా చెప్పాడు. అదేమిటంటే - అమ్మాయికి పెళ్లి చేయమని, చేస్తే అది తగ్గుతుందనీని. అదెలా జరుగుతుందంటే మొగుడు, అత్తింటి కొత్త వాతావరణం ఆమెను మార్చే అవకాశం ఎక్కువనీ, మాకు మరో మార్గం లేకపోయింది. నిజమేననిపించింది. నీకిచ్చి పెళ్లి చేశాం. నువ్వు చాలా మంచి వాడివి, మా అమ్మాయి గొంతు కోయవని మా నమ్మకం" అని నా చేతులు ప్రాధేయపూర్వకంగా నలిపేస్తూ అన్నాడు మా మామగారు.

పాపం ఆ బలహీనతకి లోనయిన నా భార్యదేం తప్పు? కన్న ఈ తల్లిదండ్రులదేం తప్పు? తనని మామూలుగా మార్చుకోవాలి. భర్తగా అదే నా తక్షణ కర్తవ్యం.

తనతో, తన అలవాటుతో కాపురం నాకు అలవాటయింది. "అందరూ అంతంతసేపు సినిమాలు చూస్తారు. అడ్వర్టయిజ్‌మెంట్ల లోనే సృజనాత్మకత పాళ్లెక్కువ. సినిమాల్లాగా మూడు పాటలు, నాలుగు ఫైట్లనే కమర్షియల్ ఫార్ములాలుండవు. స్టార్డం కలిగిన స్టార్ల పాత చింతకాయ పచ్చడి యాక్షన్ ఉండదు. టిక్కెట్లకు బోలెడంత డబ్బు పోసి, వెళ్లి చూసి తలనొప్పి తెచ్చుకోనక్కర్లేదు. దేనికదే కొత్తగా, వెరైటీగా ఉంటుంది. షార్ట్ ఫిల్మ్‌లు ఇప్పుడొచ్చాయి. అలాగే అతి తక్కువ నిడివితో అందర్నీ ఆకట్టుకునే అడ్వర్టయిజ్‌మెంట్లు ఎప్పుడో వచ్చాయి. అందుకే అడ్వర్టయిజ్‌మెంట్లు అంటే నాకు ప్రాణం. అవి లేకపోతే ఏ ప్రొడక్టయినా గోడక్కొట్టిన పిడకల్లాగా తయారీదారు దగ్గర ఉండిపోవాలసిందే. అవి చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే ఈ జీవితం అడ్వర్టయిజ్‌మెంట్లకి అంకితం" అంటుంది. అంతేకాదు, సినిమా వస్తున్న టైంలో రిమోట్‌తో ఛానల్ మార్చి అక్కడ అడ్వర్టయిజ్‌మెంట్లు చూస్తుందంతే, అందులో చూపించిన వస్తువులు కొనమని ప్రాణం తీయదు. ఆ బలహీనత కూడా ఉండుంటే, నా గొర్రెతోక జీతానికి గొప్ప పనిష్మెంట్ అయ్యేది. ఇంటి ర్యాకులన్నీ సూపర్ మార్కెట్‌లా వస్తువులతో నిండిపోయి ఉండేవి.

నా పెళ్ళి కొత్త కోడలొస్తే ఎక్కడ తన హక్కులకు భంగం వాటిల్లుతుందో అని బెంగటిల్లిని మా అమ్మ వంటింటి సామ్రాజ్యాన్ని, ఇంటిని, మమ్మల్నీ ఎప్పటిలా సంతోషంగా ఏలసాగింది. కొత్త కోడలు సమయానికిన్ని కాఫీ చుక్కలు పోసి, అన్నం పెట్టడం వల్ల పూర్వ ప్రాభవం కొంతైనా అనుభవించొచ్చనుకున్న మా నాన్న ఆశలు మాత్రం అడియాసలు అయ్యాయి. మా అమ్మ దాష్టీకానికి తల ఒగ్గి యథాప్రకారం నిర్లిప్తంగా బతికేస్తున్నారు.

నా సంగతే అంతుపట్టడం లేదు.

పెళ్లయిన కొత్తలో, కొత్త పెళ్లాంతో సరదా సరదాగా కాలం గడపలేకపోతున్నాను. సినిమాకెళ్లాలి, పార్క్ కెళ్లాలి లాంటి అచ్చట్లు ముచ్చట్లు లేవు. తను టీ.వీ. చూస్తున్నప్పుడు పక్కన చేరి ఆమెని అక్కడక్కడ తమకంతో సవరించడం, అటుక్కున ముద్దు పెట్టుకోవడం తప్ప ముందుకెళ్లలేని పరిస్థితి.

'ఇహ లాభం లేదు. వాళ్ల నాన్న రాగిణికి బలహీనత దూరం చేయడానికి చేసిన పనే నేనూ చేయాలి. తనకో పిల్లనో, పిల్లాడినో ఇస్తే వాడి ఆలన పాలనతో, అడ్వర్టయిజ్‌మెంట్ల గోల మర్చిపోతుంది' మనసులో క్లిక్ మన్న ఐడియా నన్నెంతగానో ఉత్సాహపరచింది.

ఓ నడిరాత్రి రెండు, మూడు గంటల నిద్ర కోసం మా ఆవిడ పడుకున్నప్పుడు మన్మథుణ్ని ఆవాహనం చేసుకున్నాను. రెచ్చిపోయాను. రాగిణి నెలతప్పింది. కోడలు నెల తప్పడం మా అమ్మ ఆనందానికి అవధి లేకుండా చేసింది. టీ.వీ. చూస్తున్న కోడలి అవసరాలు కనిపెట్టు కుని ఉంచడమే కాకుండా, కూతుర్ని చూసుకున్నట్టు కంటికి రెప్పలా చూసుకుంటోంది. బహుశా రేపు కాన్పయ్యాక రాగిణి అలాగే టీవీకి అతుక్కుపోయుంటే, తను మనవడితో కాలక్షేపం చెయ్యవచ్చనేమో, అదీగాక వంశాంకురమాయె, కానీ బిడ్డ పుట్టి రాగిణి బలహీనత కుదురుకుపోతే అమ్మకు ఆశనిపాతమే!

రాగిణిని వాళ్లవాళ్లు ఏడవనెల పురిటికి తీసుకెళ్లారు. ఒక శుభ దినాన నాకు వంశోద్ధారకుడు పుట్టాడన్న శుభవార్త అందింది. నా ఆనందం అంతా ఇంతా కాదు. తన పుట్టింటి వాళ్లవీ, నావీ ఆశలు తీరబోతున్నాయి. ఇన్నాళ్లకి తనని అడ్వర్టయిజ్‌మెంట్ల బారి నుంచి కాపాడబోతున్నాను. నా పెళ్లాన్ని నాదాన్ని చేసుకోబోతున్నాను.

నేను హుటాహుటిన బయల్దేరి వెళ్లాను. హాస్పిటల్లో స్పెషల్ రూంలో ఉన్న తల్లీ పిల్లాడిని చూసిన ఆనందం క్షణం కూడా నిలవలేదు. కారణం రాగిణీ, నిన్న గాక మొన్న పుట్టిన వాడూ గోడకున్న టీవీలో వస్తున్న అడ్వర్టయిజ్‌మెంట్ల వైపు కళ్లార్పకుండా చూస్తున్నారు. నేను 'హతవిధీ' అని మనసులో అనుకుంటూ నిరాశా, నిస్పృహ లతో రూం బయట కొచ్చా ను. మా మావగారు నా చేతులు తన చేతిలో ఉంచుకుని ప్రాధేయ పూర్వకంగా నలు పుతూ "బాబూ, విధి మన తో వింత నాటకం ఆడుతోంది. పుట్టిన బాబు కూడా టీవీలో అడ్వర్టయిజ్‌మెంట్లు కళ్లార్పకుండా చూస్తున్నాడు. మొన్న కరెంట్ పోయి టీవీ ఆగి పోతే ఒకటే ఏడుపు. నేను అప్పటి కప్పుడు ఇన్వర్టర్ కొనుక్కొచ్చి టీ.వీ.కి కనెక్ట్ చేసే దాకా ఏడుపు ఆపితే ఒట్టు. నువ్వే పెద్ద మనసు చేసుకుని.." అన్నాడు. నా కళ్లు బైర్లు కమ్మాయి. నన్ను స్ట్రెచర్ మీదకు ఎక్కించడం వరకు గుర్తుంది... ఆ తర్వాత....



*రాగిణిని వాళ్లవాళ్లు ఏడవనెల పురిటికి తీసుకెళ్లారు. ఒక శుభ దినాన నాకు వంశోద్ధారకుడు పుట్టాడన్న శుభవార్త అందింది. నా ఆనందం అంతా ఇంతా కాదు. తన పుట్టింటి వాళ్లవీ, నావీ ఆశలు తీరబోతున్నాయి. ఇన్నాళ్లకి తనని అడ్వర్టైజ్‌మెంట్ల బారి నుంచి కాపాడబోతున్నాను. నా పెళ్లాన్ని నాదాన్ని చేసుకోబోతున్నాను.*

సెల్ నెం. 9393981918